నమస్తే తెలంగాణ
నల్లగొండ
3 | నల్లగొండ, గురువారం 9 మే 2024 | NALGONDA

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

• కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను చైతన్యం చేయడానికి సూర్యాపేటలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, మే 8 : భారత రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా, ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సూర్యాపేటలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కలెక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు.

అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న యువత తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు. ఓటు అవశ్యకతను తెలుపాల్సిన బాధ్యత యువతపై ఉందని చెప్పారు. ఓటర్లను చైతన్యం చేయడానికి ఈ నెల 9న కోదాద, 10న హుజూర్‌నగర్, 11న తుంగతుర్తిలో బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల రోజును సెలవు దినం అనుకొని అశ్రద్ధ చేయొద్దని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించాలని అన్నారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖలకు మెమెంటోలు అందించారు. మొదటి స్థానంలో విద్యా శాఖ, రెండో స్థానంలో డీఆర్‌డీఓ, మూడో స్థానంలో మెప్మా మున్సిపల్ శాఖ నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్వీప్ అంబాసిడర్ దుశ్చర్ల సత్యనారాయమణ, స్వీప్ నోడల్ అధికారి, డీఈఓ అశోక్, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, ఆర్డీఓ వేణుమాధవ్, తాసీల్దార్ శ్యామసుందర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఎస్ఓ మోహన్‌బాబు పాల్గొన్నారు.

### పోస్టల్ బ్యాలెట్‌కు 10 వరకు గడువు

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఈ నెల 10 వరకు గడువు పెంచినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. ఈ నెల 3 నుంచి 8వరకు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వేయడానికి అవకాశం కల్పించగా దానిని ఎన్నికల సంఘం మరో రెండు రోజులు గడువు పెంచిందని పేర్కొన్నారు. 9, 10వ తేదీల్లో సైతం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు.

## వచ్చే సీజన్‌లో సరిపోను పత్తి విత్తన ప్యాకెట్లు

• డీఏఓ శ్రవణ్ కుమార్

నల్లగొండ, మే 8: నల్లగొండ జిల్లాలో వానకాలం-2024 సీజన్ కు సంబంధించి 5,68,735 ఎకరాల్లో పత్తి పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేయగా అందుకు కావాల్సిన పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు డీఏఓ శ్రవణ్ కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం పత్తి విత్తన ప్యాకెట్ల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 14,77,340 పత్తి విత్తన పాకెట్లు అవసరం అంచనా వేసి వ్యవసాయ సంచాలకుల కార్యాలయం వివిధ కంపెనీల ద్వారా పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం ఉన్నాయన్నారు. సీజన్ సమీపిస్తున్నందన పత్తి విత్తన పాకెట్లు జిల్లాలో అవసరమైన మండలలో డీలర్లకు సరఫరా చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తీసుకోవాలన్నారు.

# మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

## రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ హవా

- కాంగ్రెస్ గ్రాఫ్ నాలుగు నెలల్లోనే పడిపోయింది
- కృత్రిమ కరువు తెచ్చిన ఆ పార్టీని తరిమికొట్టండి
- బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- అర్వపల్లి ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి




ఎన్నికల ప్రచారంలో భాగంగా అర్వపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు

అర్వపల్లి, మే 8 : ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అర్వపల్లి మండలం తిమ్మాపురంలో బుధవారం బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. పటాకులు కాల్చి బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలు నాలుగు నెలల్లో బయటపడ్డాయని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముసుగులో మరోమారు మోసం చేసేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పూర్తిగా పడి పోయిందని, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ హవా మొదలైందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అత్యధిక సీట్లు రావడం ఖాయమన్నారు. కేవలం ఐదు నెలల్లోనే ఇంతటి వ్యతిరేకత ఏ పార్టీకి ఎదురు కాలేదని, కాంగ్రెస్ అతి తక్కువ సమయంలో చతికిలా పడ్డదని చెప్పారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ అంటే నమ్మి ఓటేస్తే రైతుబంధు ఇవ్వలేదని, ఎకరానికి 15వేల రూపాయలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, నిరుద్యోగులకు 4వేల భృతి ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తుంగతుర్తి నియోజకవర్గం రక్త పాతాలతో రగిలి పోతే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం జలాలతో 10 సంవత్సరాలో నియోజకవర్గం పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలమైందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా కూడా రైతులకు నీళ్లు ఇవ్వలేని దద్దమ్మలు జిల్లా మంత్రులు అన్ని ఎద్దేవా చేశారు. 4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ముసలోళ్లను కూడా మోసం చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్క నిమిషం కూడా పోని కరెంట్ ఇప్పుడు ఎప్పుడు కరెంట్ వస్తుందో పోతుందో తెలువదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని, క్యామ మల్లేశ్‌ను కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు నరసింహారెడ్డి, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్‌యాదవ్, జీడి భిక్షం, రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గుండగాని సోమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ మారిపెద్ది భవాని, జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, గ్రామశాఖ అధ్యక్షులు దశరథ రామారావు, సుందర్, రామలింగయ్య, లింగమూర్తి, మల్లయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలకు మరోసారి మోసపోవద్దు

- రేవంత్ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



కొండమల్లేపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, మే 8 : నల్లగొండ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగుర వేసేందుకు బీఆర్ఎస్ సైనికులంతా కష్టపడి పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిందని, ఆరు గారెంటీలను ఇంతవరకూ అమలు చేయలేదని మండిపడ్డారు. రైతుబంధు రూ.15 వేలు, ఆసరా పింఛన్లు రూ.4 వేలు, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, పంటలకు రూ.500 బోనస్, ఆడ బిడ్డలకు రూ.2,500 ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి సర్కారు కాలయాపన చేస్తున్నదని తెలిపారు. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల ముందు ఆగస్టు 15కు వరకు రైతు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని, ప్రజలు నమ్మొద్దని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆగం కావద్దని, కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్, మారం రవీందర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, బీఆర్ఎస్ దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాధ్యక్షులు టీవీఎన్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, మండల యువజన అధ్యక్షుడు రమావత్ తులసీరాం నాయక్, పెద్దిశెట్టి సత్యం, దాచేపల్లి నరేందర్, ముడావత్ పాండు నాయక్, నేనావత్ శంకర్‌నాయక్, రమావత్ దీప్లానాయక్, రమావత్ రూప్లానాయక్, పేట రమేశ్, వడ్త్యా బలరాం నాయక్, జబ్బు యాదయ్య యాదవ్, పంగలాలయ్య, నేనావత్ శంకర్‌నాయక్, వరికుప్పల పాండు, ఎం. శేఖర్‌యాదవ్, గిరి, రావుల సత్యనారాయణ, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

## పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా

• నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మే8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా గత ఎన్నికల్లోని పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే పాత నేరస్తులను కట్టడి చేసేందుకు జిల్లా పోలీసు కార్యాచరణ రూపొందించిందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 693 మంది పాత నేరస్తులు, రౌడీ షీటర్స్‌ను బైండోవర్ చేశామని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 313 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## మాదిగల మద్దతు బీఆర్ఎస్‌కే..

- మాదిగలను అణిచివేస్తున్న కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్తాం
- ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాదిగ

నల్లగొండ రూరల్, మే 8 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా అణిచివేస్తున్నారని, ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్ మాదిగ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ఎమ్మార్పీఎస్ బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని, ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి రేవంత్‌రెడ్డికి గోరి కట్టాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నకిరేకంటి అంజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లేశ్, మొండి కత్తి అశోక్, బచ్చలకూరి నాగరాజు, పొట్ట మురళి, నారాయణ, నాగరాజు, వర ప్రసాద్, లక్ష్మణ్, శివ, సైదులు, ఈశ్వర్, యేసు పాల్గొన్నారు.

### రెండోరోజు సజావుగా ఎప్‌సెట్

రామగిరి, మే 8 : తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ ఈఏపీఈ సెట్-2024) రెండో రోజు బుధవారం నల్లగొండ ఎస్పీఆర్ స్కూల్ ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో సజావుగా జరిగింది. ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఉదయం జరిగిన పరీక్షకు 180 మంది విద్యార్థులకు 175మంది హాజరయ్యారు.

# అన్నదాతను ముంచిన సర్కారు నిర్లక్ష్యం

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ అలసత్వం
- కొన్న వడ్లను కూడా రవాణా చేయని వైనం
- ముందే కరువుతో ఎండిన సగం పంట
- ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంకింత నష్టం

## అకాల వర్షంతో రైతన్న అరిగోస

## వేల బస్తాల్లో తడిసిన వడ్లు

**జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంట నేలపాలైంది. కొనుగోళ్లలో నిర్లక్ష్యం, లారీలు, గన్నీ బ్యాగుల కొరతతో ధాన్యం తడిసింది. ఇప్పటికే కరువుతో సగం పంట ఎండిపోగా.. సర్కారు నిర్లక్ష్యంతో రైతన్న ఇంకింత నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, మే 8 (నమస్తే తెలంగాణ)



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

వరి కోతలు చివరి దశకు రావడంతో పంటలు చేతికొస్తున్నాయి. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 323 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అధికారులు మంగళవారం వరకు 75వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు లేవని రైతులు చెప్తున్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ముఖ్యంగా భువనగిరి, బొమ్మలరామారం, వలిగొండ, బీబీనగర్, రామన్నపేట, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, మోటకొండూరు, ఆలేరు, గుండాల, మోత్కూరు, అడ్డగూడూరు, యాదగిరిగుట్ట మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దాంతో వేల బస్తాల ధాన్యం తడిసిపోయింది. ఒక్కసారిగా పెద్ద ఎత్తున గాలి దుమారం రావడంతో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్ కవర్లు కొట్టుకుపోయాయి.

### ఐదురోజులైనా కొంటలేరు..

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కరెంట్ కోతలు, సాగునీరు లేక ఇప్పటికే కరువు తాండవించడంతో సగం పంటలు ఎండిపోయాయి. మిగిలిన పంటను అష్టకష్టాలు పడి కాపాడుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే వివిధ కారణాలు చెప్తూ నాలుగైదు రోజులైనా కొంటలేరు. దాంతో కల్లాల్లో ధాన్యం రాశులు నిలిచిపోతున్నాయి. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు నిర్వాహలకు కొర్రీలు పెడుతున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని ఏ గ్రేడ్, ఆ తర్వాత ధాన్యాన్ని బీ-గ్రేడ్‌కు కొంటారు. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చినా తేమ, తాలు, క్వాలిటీ లేదంటూ తక్కువకు కొంటున్నట్లు రైతులు వాపోతున్నారు.

### లారీల కొరత.. తడుస్తున్న వడ్లు

కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ధాన్యం కొంటున్నా రవాణాలో ఆగిపోతున్నది. రోజులు గడుస్తున్నా ధాన్యం బస్తాలు అక్కడే ఉంటున్నాయి. కొన్న వడ్లు రవాణా చేస్తేనే ఆ తర్వాత వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెప్తున్నారు. పాత ధాన్యం ట్రాన్స్‌పోర్ట్ చేయకపోవడంతో కొనుగోళ్లు కూడా సరిగ్గా ముందుకు సాగడం లేదు. లారీల కొరతే ఇందుకు కారణంగా చెప్తున్నారు. కొన్నిచోట్ల కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లారీలు ధాన్యాన్ని రవాణా చేయకపోవడంతో వర్షానికి వడ్లన్నీ తడిసిపోతున్నాయి. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు రోడ్డెక్కుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం గమనార్హం.

### ధాన్యం తెచ్చి నెల దాటినా తూకం వేయలే



చౌటుప్పల్ మార్కెట్‌లో వడ్లు పోసి నెల అయ్యింది. ఇప్పటికీ తూకం వేయలేదు. కొనడానికి సమయం పడుతుందని అధికారులు అన్నరు. మిల్లుల నుంచి లారీలు రావడం లేదని చెప్తున్నరు. హమాలీల కొరత కూడా ఉంది. మంగళవారం రాత్రి కురిసిన వానకు వడ్లన్నీ తడిసినయి. ఇప్పటికైనా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

**-సుర్కంటి మనోహర, శేరిల్ల, చౌటుప్పల్**

### ధాన్యం త్వరగా తరలించాలి



మా ధాన్యం కాంటా వేసి 4 రోజులు అయ్యింది. లారీల కొరతతో ధాన్యం బస్తాలు మిల్లుకు తరలించలేదు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గాలికి బస్తాలపై ఉన్న పట్టాలు ఎగిరిపోవడంతో110 బస్తాలు తడిసిపోయాయి. అధికారులు ధాన్యం తరలింపు చర్యలు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

**-మర్రి గిరిప్రసాద్‌రెడ్డి, రైతు, రంగాపురం, బొమ్మలరామారం**

## ఆరో రోజు 19 మంది నామినేషన్

### నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లకు ఆఖరు..

### 10న స్క్రూటినీ, 13న ఉపసంహరణ

నల్లగొండ, మే 8 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలో భాగంగా బుధవారం ఆరో రోజు 19 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లు వేశారు. ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్ ఒక సెట్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పాలకూరి అశోక్ కుమార్ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న ఒక సెట్, గోండ్వానా దండకారణ్య పార్టీ నుంచి సోడె వెంకటేశ్వర్లు ఒక సెట్, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేశ్ ఒక సెట్, సోషల్ జస్టిస్ పార్టీ నుంచి చెన్నా శ్రీకాంత్ 2 సెట్లు, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నుంచి గుండాల జ్యోతి ఒక సెట్, బీజేపీ నుంచి కేదారి మేకల ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోతుల ప్రార్థన రెండు సెట్లు, గంగిరెడ్డి కోటిరెడ్డి ఒక సెట్, తేజావత్ వాసుదేవ ఒక సెట్, భైరవభట్ల శ్రీనివాసరావు ఒక సెట్, యాతాకుల శేఖర్ ఒక సెట్, దునుకుల వేలాద్రి ఒక సెట్, గుగులోతు సంతోష్ ఒక సెట్, రత్నం ప్రవీణ్ ఒక సెట్, జన్ను భరత్ ఒక సెట్, గుగులోతు రాజు నాయక్ ఒక సెట్, పట్టం మల్లికార్జున ఒక సెట్ నామినేషన్లను అందించారు. నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు వీరు నామినేషన్ పత్రాలను సమర్పించారు. గురువారం వరకు నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా, 10న స్క్రూటినీ, 13న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల జాబి తా, గుర్తుల కేటాయింపు చేయనున్నారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించి వచ్చే నెల 5న ఫలితాలు వెల్లడించనున్నారు.